## చిట్టి కథ

పెట్టి బేడా పట్టుకుని వినాయకరావు అత్తవారింట్లో అడుగుపెట్టేటప్పుడు గంట పగలు రెండుంబావు. గోదావరి ఎక్స్‌ప్రెస్ ఆరు గంటలు లేటు. పొద్దున్నే హైదరాబాదులో వినాయక చవితి పూజ కందుకో వచ్చనుకున్న తన అంచనా ఈ రైలు ప్రయాణంతో తారుమారయింది.

లోపలికి వెళ్లగానే

"హలో... బావగారూ... రండి రండి... రైలెక్కి వస్తారనుకుంటే పండక్కు బాగా ఎండెక్కి వచ్చారే?"

అసలే ప్రయాణపు బడలికలో ఉన్న వినాయక రావుకు బావమరిది వేసిన జోకుకు లాగి చెంపకాయ కొట్టాలన్నంత కోపం వచ్చింది. కానీ సభ్యత కోసం తమాయించుకుని ఓ చిన్న చిరునవ్వు వెలగబెట్టి ఎదురొచ్చిన పెళ్ళాం లక్ష్మిచేతికి సూట్‌కేసునిచ్చి కాళ్ళు కడుక్కోటానికి బాత్‌రూమ్‌లోకి దూరాడు.

* * *

"ప్రొద్దున్నుంచి అందరం మీకోసం ఎదురుచూశాం. చివరికి పంతులు గారు తొందర చేస్తే ఇందాకనే వినాయక చవితి వ్రతం పూర్తి చేసుకున్నాం..." తప్పు చేసిన వారిలా తల దించుకున్నారు అత్త మామలు....

# చిత్తం శివుడి మీదా...

"అబ్బే దాందేవుందండీ... దైవభక్తి అనేది మనసులో ఉండాలి. నా వినాయకచవితి ఇవాళ రైల్లోనే గడిచిపోయింది. అందుకోసం మీరేమీ బాధపడకండి..." అంటూ భోజనానికి లేచాడు వినాయక రావు.

భోజనంసమయంలోబావమరిది "బావా ఇవాళ రాత్రి చవితిచంద్రుడ్ని చూడకు... చూశావో... శ్రీకృష్ణుడికి లాగా నీక్కూడా నీలాపనిందలు చుట్టుకుంటాయి..."

"అని ఎవరన్నారు" ఎదురుప్రశ్న వేశాడు వినాయకరావు.

"కైలాస పర్వతంలో ఆడుకుంటున్న వినాయకుడ్ని చూసి చంద్రుడు నవ్వితే మరి వినాయకుడు శాపం ఇచ్చాడుగా."

"అహా అది నువ్వు చూశావా?"

"అదికాదు బావా అసలు చంద్రుడు ఆకాశంలో ఉంటాడా? కైలాసంలో ఉంటాడా? లేక శివుడి నెత్తిన ఉంటాడా?"

"వినాయకుడ్ని చూసి నవ్విన చంద్రుడు ఆకాశంలోని చంద్రుడయితే అది ఒక గ్రహం. దానిమీదికి నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, మన దేశం నుంచి రాకేష్ శర్మ వెళ్ళి వచ్చారు. శివుడి నెత్తిన ఉండే చంద్రుడికి వినాయకుడ్ని చూసి నవ్వే ధైర్యం ఉండదు. ఒక వేళ అలా అతడు నవ్వి ఉంటే, అక్కడ శివుడు



కూడా ఉండి ఉండాలి కదా? మరి కథలో అలా లేదే?

"అసలు ఇది జరిగింది రాత్రా? పగలా? పగలయితే అసలు చంద్రుడే ఉండడు. రాత్రయితే చవితి చంద్రుడు అతి తక్కువ కాలమే కనిపిస్తాడు. వీటన్నిటి గురించి ఎప్పుడైనా ఆలోచించావా?"

"అయ్య బాబోయ్... అంటే నువ్వు నాస్తికుడివా బావా" తన ఆశ్చర్యం వెళ్ళబుచ్చాడు బావమరిది. "అయితే ఇవాళ రాత్రికి ధైర్యంగా చవితి చంద్రుడ్ని చూస్తావా? పది రూపాయలు పందెం."

పది రూపాయలు తేరగా వస్తూంటే వదులుకోవడం ఎందుకని భార్య, అత్త మామలు వారిస్తున్నా వినకుండా ఓ.కే. అన్నాడు వినాయకరావు.

రాత్రి డాబా మీద చవితి చంద్రుడ్ని చూసిన వినాయకరావుని చూసి బావమరిది "బావా రేపట్నించి చూడు నీకంతా నీలాపనిందలే" అన్నాడు.

"నాకలాంటి నమ్మకాలు లేవు" మళ్ళీ చెప్పి తన గదిలోకి దూరాడు వినాయకరావు.

* * *

ప్రొద్దున్నే ఫోను మ్రోగింది.

"హలో... ఎవరూ?... మా బావగారు వినాయకరావా? ఉన్నారు, సంగతి చెప్పండి... ఏంటీ... అఫిషియల్ సంగతా ఉండండి పిలుస్తా... బావా ఫోను. ఏదో ఆఫీసులో గందరగోళం అనుకుంటా. ప్రొద్దునే ఫోను చేశారు. వినాయకుడి శాపం వదిలి పెడతాడా?" ఆనందపడిపోతున్నాడు బావమరిది.

"ఆఁహా... అలాగా... చాలా థ్యాంక్స్... రెండు మూడు రోజుల్లో వచ్చేస్తా..." నవ్వుతూ ఫోను పెట్టేశాడు వినాకరావు.

"అబ్బే ఏంలేదు బావా నాకు ప్రమోషన్ వచ్చిందిట - మేనేజర్ వైజాగ్ నుంచి ఫోన్ చేశాడు. రెండు రోజుల్లో వస్తానని చెప్పా."

బిక్కమొఖం పెట్టాడు బావమరిది.

"ఆఁ అన్నట్లు ఇవాళ పేపరేది? పోయిన వారం ఒకడు ప్రాణం తీస్తే వాడి పోరు పడలేక ఒక లాటరీ టిక్కెట్టు కొన్నా. రిజల్ట్ చూడాలి... ఆహా... ఫస్ట్ ప్రైజ్ లక్ష రూపాయలు."

"నిజంగానే..." నోరు తెరిచాడు బావమరిది.

"బావా పేపర్లో ఈ న్యూస్ చూడు. ఈ సంవత్సరం మా కంపెనీకి 20% బోనస్ అని వేశారు. అయితే వచ్చే దీపావళికి మీ అక్కయ్యకు పట్టుచీర ఖాయం... బావా నిన్న పండుగ రోజున నువ్వు పది రూపాయలిచ్చిన వేళా విశేషం అన్నీ బాగా కలిసి వస్తున్నాయి. చాలా థ్యాంక్స్ బావా."

"వినాయకా మా బావకి వినాయకరావ్ అని నీ పేరు పెట్టుకున్నందువల్ల సపోర్ట్ చేస్తున్నావా తండ్రీ. ఏమైంది నీ శాపం?" బావమరిది మనసులో మధనపడి పోతున్నాడు.

* * *

"సార్ టెలిగ్రాం..." వచ్చిన టెలిగ్రాంను అందుకొని "మైగాడ్... అన్నయ్యా నీకేరా... కొంప మునిగింది. మీ బాంక్‌లో కాష్ తగ్గిందట. కాషియర్‌వి నువ్వే కాబట్టి వచ్చి కట్టమని టెలిగ్రాం. నీమీద సివియర్ ఏక్షన్ కూడా తీసుకుంటున్నారట. లీవు కాన్సిల్ చేసుకుని వెంటనే బెజవాడ వెళ్ళు..."

"ఇదేం కొత్త ప్రాబ్లంరా దేవుడా..." బావమరిది బెంబేలు పడిపోయాడు. "ఇదుగో లక్ష్మీ నేను బస్టాండ్‌కి వెళ్ళి ఓ టిక్కెట్టు బుక్ చేసుకొస్తా!" అంటూ గాభరాగా బయలుదేరాడు బావమరిది.

దారిలో ఓ కారుకి స్కూటర్ గుద్ది చేతులు కాళ్ళకు కట్లు వేయించుకుని బాండేజీతో ఇంటికొచ్చి బావురుమన్నాడు బావమరిది.

"అటు పనిచేసే బాంకిలో ప్రాబ్లం, స్కూటరు పచ్చడి పచ్చడి అయిపోయింది. ఒళ్ళు హూనం అయిపోయింది. వినాయక వ్రతం చెయ్యనివాళ్ళు బాగానే ఉన్నారు. తు.చ. తప్పకుండా అన్నీ చేసుకున్న నాకు ఇన్ని కష్టాలా తండ్రీ...."

* * *

"ఒరేయ్ అన్నయ్యా ఇంకా మొద్దు నిద్రేమిటి లేవరా. బావగారు ఊరికి బయలుదేరే టైం అయింది. స్కూటరులో తీసుకెళ్ళి బస్టాండ్‌లో డ్రాప్ చేసిరా."

కలలోని కల్లోలం నుంచి ఇహలోకానికి వచ్చాడు బావమరిది. తను కన్నది కల అని తెలుసుకుని వినాయకుడికి వెయ్యి దణ్ణాలు పెట్టుకున్నాడు. తన కల సంగతి విని ఇంటిల్లిపాదీ నవ్వారు.

"అది కాదు బావా, అసలు ఈ పూజలు పునస్కారాలు ఒక క్రమశిక్షణ కోసం పెట్టినవి. పూజలు చెయ్యనివారికే కష్టాలు వస్తాయి, చేసినవారికి రావు అని ఏం రూల్ లేదు. పైగా తెలిసో తెలియకో పూజ చెయ్యలేకపోయినా రైల్లో కూర్చొని పూజ చేసే మిమ్మల్ని తలుచుకుని ఆనందించాను నేను. కానీ దేవుడి ముందు కూర్చొని పూజ చేస్తూ పూజ చెయ్యని నన్ను గూర్చి ఆలోచిస్తూ ఆనందించావు నువ్వు. చిత్తం శివుడి మీద భక్తి చెప్పుల మీద అన్నట్లుగా. అందుకే దేవుడు కలలో నీకో చిన్న కలకలం కల్గించాడు." అన్నాడు వినాయకరావు.

ఆ సమయంలో వినాయకరావుని చూస్తే కురుక్షేత్రంలో గీతోపదేశం చేస్తున్న కృష్ణుడిలా తోచింది అతని బావమరిదికి. ●

\- సిహెచ్. ఇంద్రాణి